క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

నల్లగొండ: పట్టణంలో గురువారం ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ ఏడీఈ వేణుగోపాలచార్యులు ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల ఈదురుగాలులు, వానలకు చెట్లు విరిగి, కొమ్మలు విద్యుత్ తీగలపై పడడం వల్ల విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతోందని, ఈ సమస్య పరిష్కారానికి చెట్ల కొమ్మలు కొడుతున్నామన్నారు. శాంతి నగర్ ఫీడర్, డీవీకే 11కేవీ ఫీడర్, ఎస్ఎల్‌బీసీ టౌన్ ఫీడర్ -1, మాన్యంచెల్క, లిటిల్ ఫ్లవర్ స్కూల్ ఏరియా, శాంతి నగర్, ముషంపల్లి రోడ్, హైదర్‌ఖాన్‌గూడ, రెహమత్ నగర్, వన్ టౌన్ పోలీస్ స్టేషన్ ఏరియా, డీఎంహెచ్ఓ ఆఫీస్ రోడ్డు, రైతు బజార్, డీఈఓ కార్యాలయం, జూనియర్ కాలేజీ, సెయింట్ ఆల్ఫాన్స్ స్కూల్, జైల్ ఖానా, సిద్ధార్థ కాలనీ, అబ్బాసియా కాలనీ, సాయి నగర్, చైతన్యపురి కాలనీ, గంధం వారిగూడెం రోడ్డు, లూజు నగర్ కాలనీ, లెప్రసీ హాస్పిటల్ ఏరియా, గణేశ్ నగర్, దుప్పలపల్లి రోడ్డులలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

మున్సిపల్ కమిషనర్ బదిలీ

చిట్యాల: స్థానిక మున్సిపాలిటీ కమిషనర్ పి.వీరేందర్ సీడీఎంఏకు బదిలీ అయ్యారు. కాగా నందికొండ మున్సిపల్ కమిషనర్ దండు శ్రీను బుధవారం చిట్యాల మున్సిపాలిటీ ఇన్‌చార్జ్ కమిషనర్‌గా విధుల్లో చేరారు.

ఆర్థికసాయం అందజేత

చిట్యాల: మండలంలోని ఎలికట్టె గ్రామానికి చెందిన సాగర్ల లింగయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. మృతుడి కుటుంబానికి బీఆర్‌ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు కంచర్ల కృష్ణారెడ్డి పంపిన రూ.10 వేల ఆర్థిక సహాయాన్ని బుధవారం ఆ గ్రామ బీఆర్‌ఎస్ నాయకులు అందజేశారు. కార్యక్రమంలో ఆ గ్రామ మాజీ సర్పంచ్ ఉయ్యాల సత్తయ్యగౌడ్, మాజీ ఎంపీటీసీ గోలనుకొండ దశరథ, మండల శ్రీను, రోశయ్య, సతీష్‌రెడ్డి, సంజీవ, మల్లయ్య, ఎర్రయ్య, నర్సింహ పాల్గొన్నారు.

మహాసభలను జయప్రదం చేయాలి

నల్లగొండ టౌన్ : రంగారెడ్డి జిల్లా శంషాబాద్‌లో ఈ నెల 21, 22 తేదీల్లో జరిగే భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పల్లా దేవేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. మహాసభలకు సంబంధించిన పోస్టర్‌ను బుధవారం నల్లగొండలోని సంఘం కార్యాలయంలో ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో నూనె రామస్వామి, దోటి వెంకన్న, వెంకటేశ్వర్లు, కే.ఎస్.రెడ్డి, పానెం వెంకట్‌రావు, బెల్లం శివయ్య, అంజయ్య, రవి, యాదయ్య, నరేందర్, నర్సయ్య, అక్కలయ్య పాల్గొన్నారు.

పీఏసీఎస్ చైర్మన్‌కు మాజీ ఎమ్మెల్యే పరామర్శ



రాములమ్మ మృతదేహానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే కంచర్ల

కనగల్ : కనగల్ పీఏసీఎస్ చైర్మన్ వంగాల సహదేవరెడ్డి మాతృమూర్తి రాములమ్మ(97) బుధవారం అనారోగ్యంతో మృతిచెందింది. రాములమ్మ మృతదేహాన్ని మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం సహదేవరెడ్డిని పరామర్శించారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ నాయకులు మందడి సైదిరెడ్డి, కటికం సత్తయ్యగౌడ్, కరీంపాష, యాదయ్యగౌడ్, దోటి శ్రీనివాస్, బల్గూరి మల్లయ్య, రామగిరి శ్రీధర్‌రావు, జొన్నలగడ్డ శేఖర్‌రెడ్డి, బోనగిరి దేవేందర్, కడారి కృష్ణయ్య తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

కేతేపల్లి: ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని కొత్తపేట జెడ్పీహెచ్ఎస్ హెచ్ఎం వి.రాధాకృష్ణమాచార్యులు అన్నారు. పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని కోరుతూ బుధవారం మండలంలోని కొత్తపేట గ్రామంలో జెడ్పీహెచ్ఎస్ ఉపాధ్యాయులు ముందస్తు బడిబాట కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శంకరయ్య పాల్గొన్నారు.

చలివేంద్రాలు ప్రారంభం

చండూరు : మున్సిపాలిటీ కేంద్రంతోపాటు, కస్తాల, బంగారిగడ్డ, కొండాపురం ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద టీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంతో ఏర్పాటు చేసిన చలివేంద్రాలను ఫౌండేషన్ చైర్మన్ బొబ్బల వెంకటరాంరెడ్డి బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఎఫ్ఏసీఎస్ చైర్మన్ కోడి సుష్మావెంకన్న, వైస్ చైర్మన్ శ్రీనివాస్, డైరెక్టర్ కట్ట భిక్షం, సీఈఓ అమరేందర్‌రెడ్డి, ఫౌండేషన్ సభ్యులు, వెంకట్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, లింగస్వామి, శ్రీహరి, రాజు, రఘు, దిలీప్, సైదులు, రవి పాల్గొన్నారు.



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

సర్కారు వైద్యం మరింత మెరుగు !



నకిరేకల్‌లో 100 పడకల వైద్యశాల భవన సముదాయం



పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వేముల వీరేశం, అధికారులు

- నకిరేకల్‌లో పూర్తికావొచ్చిన 100 పడకల ఆస్పత్రి భవన నిర్మాణం
- మే చివరిలో సీఎం చేతుల మీదుగా ప్రారంభం
- భవన సముదాయాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే వీరేశం, అధికారులు

నకిరేకల్ : ఈ ప్రాంత ప్రజల చిరకాల కల త్వరలో సాకారం కాబోతుంది. నకిరేకల్ పట్టణంలో నిర్మాణంలో ఉన్న వైద్యశాల భవనం సీఎం రేవంతర్‌రెడ్డి చేతుల మీదుగా మే నెలలో ప్రారంభించి వినియోగంలోకి తీసుకొస్తామని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం బుధవారం ప్రకటించారు. హైదరాబాద్-విజయవాడ 65వ నంబర్ జాతీయ రహదారి, 565వ నంబర్ రేణకుంట జాతీయ రహదారి, 365వ నంబర్ జాతీయ రహదారులపై ఉన్న నకిరేకల్‌లో 100 పడకల వైద్యశాల భవనం పనులు పూర్తి కావొచ్చాయి. స్థానిక ఎమ్మెల్యే వేముల వీరేశం, జిల్లా అధికార యంత్రాంగం బుధవారం భవన సముదాయాన్ని పరిశీలించారు. ఈ వైద్యశాల ప్రారంభం అయితే నకిరేకల్ ప్రాంత ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్యం అందుతుందని పేర్కొన్నారు.

2022లో 100 పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్..

గత ప్రభుత్వ హయాంలో 2022 జనవరి 21వ తేదీన నకిరేకల్ 30 పడకల వైద్యశాలను 100 పడకలకు అప్‌గ్రేడ్ చేసిన విషయం తెలిసిందే. ఈ భవన సముదాయాన్ని అందరికీ అందుబాటులో ఉండేలా స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో జాతీయ రహదారి వెంట రూ.32 కోట్ల నిధులతో ఆరు ఎకరాల స్థలంలో మూడు అంతస్తులతో నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఈ భవన సముదాయం పనులు 2024 లోపు పూర్తి కావాల్సి ఉన్నప్పటికీ నిధులు విడుదల కాకపోవడంతో ఏడాది కాలంగా పనులు నిలిచిపోయాయి. గ్రౌండ్ ఫ్లోర్, మొదట అంతస్తులో ఏ, బీ, సీ బ్లాక్‌లు, రెండో అంతస్తులో ఏ, బీ బ్లాక్‌లు నిర్మించారు. అనంతరం సంబంధిత కాంట్రాక్టర్‌కు చేసిన పనులకు నిధులు విడుదల కాకపోవడంతో మిగిలిన పనులు నిలిపివేశారు. రూ.32 కోట్ల నిధులకుగాను రూ.18 కోట్లు విలువైన పనులు 80 శాతం మేర పూర్తయ్యాయి. స్థానిక ఎమ్మెల్యే వేముల వీరేశం చొరవ తీసుకుని ఏరియా ఆస్పత్రి భవనం పనులకు నిధులు విడుదల చేయాలని ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చారు. రెండు బిల్లులకుగాను ఒక విడత బిల్లు నాలుగు నెలల క్రితం విడుదల కావడంతో నిలిచిన వైద్యశాల భవన నిర్మాణం పనులు 96 శాతం పూర్తి కావొచ్చాయి. ఆస్పత్రి ఆవరణలో సీసీ, డ్రెయినేజీ, ప్రహరీ, కొంతవరకు గదుల్లో టైల్స్ పనులు మిగిలి ఉన్నాయి.

పీహెచ్‌సీ నుంచి ఏరియా ఆస్పత్రి వరకు..

నకిరేకల్‌లో గతంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంగా ఉన్న వైద్యశాలను 1998లో 30 పడకల కమ్యూనిటీ వైద్యశాలగా మార్చారు. అప్పట్లో రోజుకు 300 నుంచి 450 మధ్య ఓపీ నమోదయింది. ప్రతిరోజూ రోగులు అధికంగా వస్తున్నా అరకొర వసతుల మధ్య వైద్య సేవలు అందాయి. గత ప్రభుత్వ హయాంలో 30 పడకల స్థాయి నుంచి 100 పడకల వైద్యశాలగా అప్‌గ్రేడ్ చేసి పాత భవన సముదాయంలోనే 100 పడకల వైద్య సేవలందిస్తున్నారు. ప్రస్తుతం 100 పడకల వైద్యశాలలో అవసరమైన డాక్టర్లు, సిబ్బంది సేవలందిస్తున్నారు. ఏటా ఆస్పత్రికి రూ.6.35 కోట్ల బడ్జెట్ కేటాయిస్తున్నారు. కొత్త భవన సముదాయం వినియోగంలోకి వస్తే నకిరేకల్, కట్టంగూరు, కేతేపల్లి, శాలిగౌరారం, తిప్పర్తి, కేతేపల్లి, కట్టంగూరు, తుంగతుర్తి, సూర్యాపేట నియోజకవర్గాల ప్రజలకు వైద్య సేవలు అందనున్నాయి.

ప్రజలకు అంకితం చేస్తాం



నకిరేకల్‌లో 100 పడకల వైద్యశాల భవన సముదాయ పనులు 96 శాతం పూర్తయ్యాయి. నిలిచిన పనులకు బిల్లులు కూడా ఇప్పించాం. వచ్చే నెల చివరిలో సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ఈ ఆస్పత్రిని ప్రారంభించి ఈ ప్రాంత ప్రజలకు అంకితం చేస్తాం.

–వేముల వీరేశం, ఎమ్మెల్యే నకిరేకల్

మౌలిక వసతుల కల్పనకు కృషి

- నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం



డ్రెయినేజీ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే వేముల వీరేశం

నకిరేకల్ : మున్సిపాలిటీలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. నకిరేకల్ పట్టణంలోని 4 వార్డు పరిధిలో స్టేడియంకు వెళ్లే దారిలో రూ.1.70 కోట్ల వ్యయంతో డ్రెయినేజీ నిర్మాణ పనులకు బుధవారం ఆయన శంకుస్థాపన చేసి మాట్లాడారు. నకిరేకల్ పట్టణంలో ప్రతి ఏటా వర్షాకాలంలో వరద నీటితో పలు ప్రాంతాలు జలమయమై పోతున్నాయన్నారు. ఈ సమస్యను అధిగమించేందుకు మెయిన్ డ్రెయినేజీ నిర్మాణం చేపట్టామన్నారు. దశలవారీగా నకిరేకల్ మున్సిపాలిటీలో అన్ని వార్డుల్లో అభివృద్ధి పనులు పూర్తి చేసి ఆదర్శ మున్సిపాలిటీగా మారుస్తామన్నారు. ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ శాఖ జిల్లా ఈఈ గిలకత్తుల సత్యనారాయణ, మున్సిపల్ చైర్‌పర్సన్ చౌగోని రజితా శ్రీనివాస్‌గౌడ్, మున్సిపల్ కమిషనర్ బాలయ్య, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు లింగాల వెంకన్న, వార్డు కౌన్సిలర్లు గాజుల సుకన్య, గర్శకోటి సైదులు, రాచకొండ సునీల్, గద్దం స్వామి, యాసారపు లక్ష్మీ వెంకన్న, బానోతు వెంకన్న, చౌగోని రాములమ్మ సైదులు, చౌగోని అఖిల లక్ష్మీనారాయణ, పోతుల సునీత రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

దగ్ధమైన ఇల్లు పరిశీలన

నకిరేకల్ పట్టణంలోని వీటీ కాలనీలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైన పజ్జు కృష్ణ ఇంటిని బుధవారం ఎమ్మెల్యే వేముల వీరేశం పరిశీలించారు. బాధిత కుటుంబీకులతో మాట్లాడి ప్రమాదానికి కారణాలు తెలుసుకున్నారు. నెలకు సరిపడా నిత్యావసర సరుకులు అందిస్తానని, ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు.

లబ్ధిదారులకు ప్రొసీడింగ్ పత్రాలు ఇవ్వాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

రామగిరి(నల్లగొండ): నల్లగొండ పట్టణంలో లాటరీ ద్వారా ఎంపిక చేసిన 552 మంది డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల లబ్ధిదారులకు వెంటనే ప్రొసీడింగ్ పత్రాలు ఇవ్వాలని కోరుతూ సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు ఎండీ సలీం, పట్టణ కార్యదర్శి దండంపల్లి సత్తయ్య బుధవారం నల్లగొండ డిప్యూటీ తహసీల్దార్ తబితకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాలుగు మాసాలుగా అధికారులను ప్రజాప్రతినిధులను కలిసినా పట్టించుకోవడం లేదన్నారు. డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల సాధన కమిటీ కన్వీనర్ అవుట రవీందర్ మాట్లాడుతూ ఈ నెల 21 నుంచి తహసీల్దార్ కార్యాలయం ఎదుట రిలే నిరాహార దీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తుమ్మల పద్మ, అద్దంకి నరసింహ, కోట్ల అశోక్ రెడ్డి, కీసర ప్రశాంతి, పగిళ్ల శీను, ఆవుల జాన్సన్, ఎలిమినేటి వెంకటమ్మ, రామగిరి నాగలక్ష్మి, పార్వతి, టీ.విశాలాక్షి, మిరియాల గణేశ్, వెంకటేశ్వర్లు, విజయలక్ష్మి, పగిళ్ల జయమ్మ, తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



నకిరేకల్ : పాలెంలో పోషణ్ అభియాన్ ర్యాలీ

మునుగోడు: గర్భిణులు, బాలింతలు పోషకాహారం తీసుకుంటేనే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎం.నాగమణి అన్నారు. పోషణ పక్షంలో భాగంగా బుధవారం మండలంలోని కొరటికల్ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం వద్ద గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పుట్టిన బిడ్డకు వెంటనే ముర్రుపాలు తాపిస్తే రోగ నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎం పద్మ, ఆశ కార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

నకిరేకల్ : అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పోషకాహారాన్ని గర్భిణులు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలని నకిరేకల్ ఐసీడీఎస్ ప్రాజెక్టు సూపర్‌వైజర్ భవాని కోరారు. పోషణ్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా నకిరేకల్ మండలం పాలెం, టేకులగూడెం గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో ఆమె పాల్గొని పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. కేంద్రాల్లో చిన్నారుల ఎన్‌రోల్‌మెంట్ పెంచాలని సిబ్బందికి సూచించారు.

నార్కట్‌పల్లి మండలంలో..

నార్కట్‌పల్లి: మండలంలోని శాపల్లి, తొండల్‌వాయి, నక్కలపల్లి, అక్కెనపల్లి, ఎం యడవల్లి, అమ్మనబోలు గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో బుధవారం పోషణ పక్షం కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మనబోలులో జరిగిన కార్యక్రమంలో సూపర్‌వైజర్ అంజలి చిరుధాన్యాలు, పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. ఆయా కార్యక్రమాల్లో అంగన్‌వాడీ టీచర్లు బి.రేణుక,ఆర్.విజయలక్ష్మి, ఆర్.హైమా, బి. విజయలక్ష్మి, బి.జయమ్మ, సునంద, గోలి కరుణ, కె.లలిత, హెచ్ఎం రవి, సైదమ్మ, ఉపేంద్ర, లక్ష్మి, ప్రభావతి, పద్మ, అనిత, ఝాన్సీ తదితరులున్నారు.

గర్భిణులు పోషకాహారం తీసుకోవాలి

గట్టుప్పల్ : గర్భిణులు, బాలింతలు నిత్యం పోషకాహారం తీసుకునేలా ఐసీడీఎస్ సిబ్బంది చర్యలు తీసుకోవాలని తహసీల్దారు రాములు అన్నారు. బుధవారం గట్టుప్పల్ మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోషణ్ అభియాన్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ యాదమ్మ, డాక్టర్లు భాస్కర్, అశోక్, కార్యదర్శి షఫి, అంగన్‌వాడీ టీచర్ రమ పాల్గొన్నారు.

ఎఫ్‌సీఐ ఆధ్వర్యంలో..

నల్లగొండ: పోషణ పక్షంలో భాగంగా రామగిరి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు బుధవారం ఎఫ్‌సీఐ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎఫ్‌సీఐ నల్లగొండ డివిజనల్ మేనేజర్ సుధీర్‌కుమార్ మాట్లాడుతూ ప్రధాన మంత్రి గరీబ్ కల్యాణ్ యోజన కింద సరఫరా చేస్తున్న బలవర్థక ఆహారాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా పంపిణీ చేస్తున్న బలవర్థక బియ్యం ద్వారా సూక్ష్మ పోషక లోపాలను నివారించవచ్చన్నారు. చిన్నతనం నుంచే బలవర్థక ఆహారం తినడం వల్ల విద్యార్థులు ఆరోగ్యంగా తయారవుతారన్నారు. కార్యక్రమంలో అధికారులు బిల్ల శ్రీనివాసరావు, కేఎస్‌కే ప్రసాద్, పవన్ కుమార్, ఆదిమల్ల శంకర్, రాము, భాస్కర్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్యామ్ సుందర్, సతీష్ రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

నకిలీ జమానతు కేసులో ఇద్దరికి జైలు శిక్ష

రామగిరి(నల్లగొండ): బెయిల్ ఇప్పించేందుకు కోర్టుకు నకిలీ జమానతు సమర్పించిన కేసులో ఇద్దరికి జైలు శిక్ష విధిస్తూ నల్లగొండ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కె.శిరీష బుధవారం తీర్పు వెల్లడించారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. నల్లగొండ వన్‌టౌన్ స్టేషన్‌లో నమోదయిన కేసులో మిర్యాలగూడ పట్టణం బంగారిగడ్డకు చెందిన మహ్మద్ జుబేర్‌కు 2008లో జైలు శిక్ష విధించారు. నిందితుడిని జైలు నుంచి బెయిల్‌పై విడిపించేందుకు వేములపల్లి మండలం శెట్టిపాలెం గ్రామానికి చెందిన పగడాల అంజయ్య, పెదపంగు ఏసు, పెద్ద చిన వెంకన్నలు జమానతు ఇచ్చేందుకు పంచాయతీ సెక్రటరీ సంతకం ఫోర్జరీ చేసి నకిలీ ధ్రువపత్రాలను సృష్టించి కోర్టుకు సమర్పించారు. అప్పటి మెజిస్ట్రేట్ రాజగోపాల్ జమానతు పత్రాలు నకిలీవి అని గుర్తించి విచారించాల్సిందిగా వన్ పోలీసులకు పిటిషన్ ఇచ్చారు. అప్పటి ఎస్ఐ ఎండీ.మజీద్ అలీఖాన్ విచారించి కేసు నమోదు చేసి చార్జీషీటు కోర్టులో సమర్పించారు. కాగా నల్లగొండ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కె.శిరీష నిందితులకు మూడు సెక్షన్ల కింద ఒక్కో సెక్షన్‌కు ఆరు నెలలు జైలు శిక్ష, రూ.4 వేల జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారు. అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎన్.కృష్ణయ్య ప్రాసిక్యూషన్ తరఫున వాదించగా, సీడీఓ కానిస్టేబుల్ రామకృష్ణ, లయజన్ ఆఫీసర్లు నరేందర్, మల్లికార్జున్ వ్యవహరించారు. నిందితుల్లో పెద్ద చిన వెంకన్న మృతి చెందాడు.

ఉపాధి పనుల పరిశీలన

తిప్పర్తి : మండలంలోని రామలింగాలగూడెంలో బుధవారం తిప్పర్తి ఎంపీడీఓ వెంకటేశ్వర్‌రెడ్డి ఉపాధిహామీ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అడిగిన ప్రతి ఒక్కరికి పని కల్పించాలని, పని ప్రదేశంలో అన్ని సదుపాయాలు కల్పించాలని సిబ్బందికి సూచించారు.

అర్హులకు రేషన్ కార్డులు ఇవ్వాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న ఐద్వా సభ్యులు

నల్లగొండ టౌన్: అర్హులకు పెన్షన్లు, రేషన్ కార్డులు ఇవ్వాలని కోరుతూ అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్‌కు ఆయన చాంబర్‌లో బుధవారం ఐద్వా సంఘం ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు ప్రభావతి మాట్లాడుతూ పేదలు రేషన్ కార్డులు, పెన్షన్ల కోసం దరఖాస్తులు చేసుకుని ఆరు సంవత్సరాలుగా ఎదురుచూస్తున్నారని తెలిపారు. పొదుపు సంఘాల మహిళలకు బీమా సౌకర్యం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఐద్వా సభ్యులు పోలిబోయిన వరలక్ష్మి కొండ అనురాధ, జిట్టా సరోజ తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దారుపై చర్యలు తీసుకోవాలని ..

శాలిగౌరారం: తన పేరు మీద ఉన్న పట్టా భూమిని సొంత అవసరాల కోసం అమ్ముకుంటుంటే అడ్డుపడుతున్న గ్రామస్తులతోపాటు వారికి సహకరిస్తున్న తహసీల్దార్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ మండలంలోని అకారం గ్రామానికి చెందిన అయిత గోని శాంతమ్మ బుధవారం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. తహసీల్దారు కార్యాలయంలోనే తనపై ప్రత్యర్థులు దాడి చేస్తున్నా తహసీల్దారు పట్టించుకోకుండా తమ కుటుంబ సభ్యులపై పోలీసులతో కేసు నమోదు చేయించారని పేర్కొంది. తనకు రక్షణ కల్పించడంతోపాటు తన భూమి కొనుగోలు చేసిన వారికి రిజిస్ట్రేషన్ అయ్యేలా తహసీల్దార్‌కు ఆదేశాలు ఇవ్వాలని కలెక్టర్‌ను కోరారు.

కప్పల విజయకు నివాళి

శాలిగౌరారం: సీపీఐ(ఎంఎల్) న్యూ డెమొక్రసీ ఊట్కూరు గ్రామ కమిటీ సభ్యురాలు, ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా నాయకురాలు కప్పల విజయ సంతాప సభ బుధవారం మండలంలోని ఊట్కూరు గ్రామంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్) న్యూ డెమొక్రసీ రాష్ట్ర నాయకుడు ఎం.డేవిడ్‌కుమార్, వేముల శంకర్, జిల్లా కార్యదర్శి ఇందూరు సాగర్, అరుణోదయ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉదయగిరి, అంబటి చిరంజీవి, ఉపేంద్ర, వెంకటేశ్వర్లు, బీవీ చారి, రవి, సత్తయ్య పాల్గొన్నారు.

రోడ్డుపైనే ధాన్యం ఆరబోత



జి యడవల్లి ఐకేపీ కేంద్రం వద్ద రోడ్డుపై ఆరబోసిన ధాన్యం

కనగల్ : మండల కేంద్రం నుంచి చండూరు వెళ్లే రహదారిలో జి యడవల్లి ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేశారు. ఐకేపీ కేంద్రం పూర్తిగా నిండిపోవడంతో రైతులు చండూరు-కనగల్ ప్రధాన రహదారిపై కిలోమీటర్ మేర ధాన్యం ఆరబోశారు. ధాన్యంపై వాహనాలు వెళ్లకుండా రాళ్లు, కర్రలను ఏర్పాటు చేశారు. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు.

పంట నష్టపోయిన రైతులు దరఖాస్తు చేసుకోండి

మర్రిగూడ : ఈదురు గాలులతో నష్టపోయిన పండ్ల తోటల రైతులు ప్రభుత్వం అందించే పరిహారం కోసం దరఖాస్తు చేసుకోవాలని మునుగోడు క్లస్టర్ ఉద్యానవన అధికారి రావుల విద్యాసాగర్ బుధవారం తెలిపారు. మునుగోడు, చండూరు, మర్రిగూడ, నాంపల్లి, గట్టుప్పల మండలాల్లో రైతులు తమ పంట వివరాలతో దరఖాస్తును సంబంధిత అధికారులకు సమర్పించాలన్నారు. రైతు పట్టాదారు పాస్‌బుక్, ఆధార్‌కార్డు, బ్యాంక్ అకౌంట్ బుక్ జీరాక్స్‌లను అందచేయాలన్నారు. పూర్తి వివరాలకు 8977714162 నంబర్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



బీరెల్లిగూడెంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మార్కెట్ చైర్మన్ నారాయణ

మునుగోడు: రైతులకు మద్దతు ధర చెల్లించేందుకు గ్రామాల్లో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని చండూరు మార్కెట్ కమిటీ చైర్మన్ దోటి నారాయణ కోరారు. మునుగోడు మండలంలోని బీరెల్లిగూడెం గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిబంధనల ప్రకారం రైతులు తమ ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకొస్తే మద్దతు ధర క్వింటాలుకు రూ.2320 అందుతుందన్నారు. తక్కువ ధరకు ప్రైవేటు వ్యాపారులకు ధాన్యం అమ్ముకుని మోసపోవద్దని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి పద్మజ, ఏపీఎం మహేశ్వరరావు, అధికారులు రైతులు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఆలయ వార్షికోత్సవాలు



చండీహోమంలో పాల్గొన్న గ్రామస్తులు

కనగల్ : మండల పరిధిలోని బుడుమర్లపల్లి గ్రామంలో శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయ ప్రథమ వార్షిక వేడుకలు కొనసాగుతున్నాయి. రెండో రోజు బుధవారం మండప పూజలు, చండీ హోమం, మూలమంత్ర హోమాలు, భజన కార్యక్రమాలు నిర్వహించారు. గురువారం ఉదయం 11 గంటలకు శ్రీ సీతారామచంద్రస్వామి శాంతి కల్యాణ మహోత్సవం కనులపండువగా నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. కల్యాణం అనంతరం అన్నప్రసాద వితరణ ఉంటుందన్నారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై వేడుకలను విజయవంతం చేయాలన్నారు.

వైభవంగా శివపార్వతుల కల్యాణం



స్వామివారికి తలంబ్రాలు సమర్పిస్తున్న దంపతులు

నల్లగొండ: పట్టణ సమీపంలోని చర్లపల్లి డీవీఎం విద్యాసంస్థల ప్రాంగణంలో బుధవారం ఎలమందల కోటేశ్వరస్వామి ఆలయ 25వ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. వేద పండితులు, అర్చక స్వాముల మంత్రాల నడుమ ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించి మధ్యాహ్నం పార్వతి కోటేశ్వరస్వామి కల్యాణోత్సవం నిర్వహించారు. డీవీఎం విద్యా సంస్థల నిర్వాహకులు దొడ్డ నాగరాజు-శాంతకుమారి, దొడ్డ శాంతికుమార్-నందిని దంపతులు స్వామివారికి కల్యాణ తలంబ్రాలు సమర్పించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కల్యాణం తిలకించారు. రాత్రి స్వామి అమ్మవార్ల ఊరేగింపు నిర్వహించారు. బ్రహ్మోత్సవాల్లో దొడ్డ సాయి సంజయ్, దొడ్డ శ్రావ్య, చొల్లేటి శ్రీధరాచారి, అధ్యాపకులు సిబ్బంది, భక్తులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దామెరభీమనపల్లి ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల ప్రతిభ

మర్రిగూడ : ఇటీవల విడుదలైన గురుకుల పాఠశాల 5వ తరగతి ప్రవేశ పరీక్ష ఫలితాల్లో తమ పాఠశాల విద్యార్థులు సత్తా చాటినట్లు దామెరభీమనపల్లి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఉదావత్ లచ్చిరాం తెలిపారు. సీట్లు సాధించిన విద్యార్థులను పాఠశాలలో బుధవారం ఆయన అభినందించారు. ఐతరాజు వర్షిత, దాసరి మౌనిక, ఎలగపల్లి మోక్ష, నడిమింటి మల్లికార్జున్, మెట్టు యశ్వంత్‌రాజ్‌లు రాష్ట్రస్థాయిలో ర్యాంకులు సాధించి గురుకులాల్లో సీట్లు సాధించారని అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మంజులత, శ్రీనివాస్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీలు అమలు చేయాలి

గట్టుప్పల్ : ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేసే వరకు సీపీఎం ఉద్యమం చేస్తుందని పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు బండ శ్రీశైలం అన్నారు. బుధవారం మండల కేంద్రంలో జరిగిన పార్టీ జనరల్ బాడీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. చాపల మారయ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి కర్నాటి మల్లేశం, ప్రజా నాట్య మండలి రాష్ట్ర కార్యదర్శి కట్ట నర్సింహ, కర్నాటి సుధాకర్, పగిళ్ల శ్రీనివాస్, అచ్చిన శ్రీనివాస్, బొట్ట శివకుమార్, ఖమ్మం రాములు తదితరులు పాల్గొన్నారు

సకాలంలో పునరావాసం కల్పించండి

మర్రిగూడ : శివన్నగూడ రిజర్వాయర్ పరిధిలోని చర్లగూడెం భూ నిర్వాసితులకు చింతపల్లి మండలంలోని వర్కాలలో పునరావాసం కల్పించే పనులను త్వరితగతిన పూర్తి చేయాలని చర్లగూడెం నిర్వాసితులు బుధవారం ఇరిగేషన్ ఈఈ రాములునాయక్‌కు, రాంరెడ్డిపల్లి పంచాయతీ కార్యదర్శి నజీరాకు వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో నాంపల్లి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు వెన్నమనేని రవీందర్‌రావు, వల్లపు కేశవ్‌గౌడ్, మారుపాకుల అనిత, కె.చంద్రశేఖర్‌రెడ్డి, ఎరుకలి నాగయ్య, భాస్కర్‌గౌడ్, కొండయ్య, మారయ్య, పాల్గొన్నారు.

ఉపాధి పనుల్లో నిర్లక్ష్యం తగదు

చండూరు : ఉపాధి హామీ పనుల్లో నిర్లక్ష్యం తగదని ఎంపీడీఓ యాదగిరి అన్నారు. బుధవారం ఉపాధిహామీ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శులు పన్నుల వసూళ్లతోపాటు మంచినీటి సరఫరా, ఇతర అత్యవసర సేవలకు అంతరాయం లేకుండా చూడాలన్నారు.